ఉల్లాస్‌కు ఊతమేది..?



- వేసవి సెలవుల్లో పూర్తికావాల్సిన ప్రక్రియ ఆలస్యం
- ఎన్నికలు, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలతో జాప్యం
- నవ భారత సాక్షరత అమలుకు కసరత్తులు
- బోధన, పర్యవేక్షణకు ముగ్గురేసి ఉపాధ్యాయుల సేకరణలో విద్యాశాఖ

జగిత్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చదువు మధ్యలోనే ఆపేసిన విద్యార్థులు, వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) యాప్, నవ భారత సాక్షరత (న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం- ఎన్ ఐఎల్‌పీ) ప్రక్రియ జిల్లాలో మందగించింది. వేసవి సెలవుల్లోనే పూర్తి కావాల్సిన ఈ ప్రక్రియ.. ఎన్ని కలు, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ లతో జాప్యం జరిగింది. దాటిన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు భారత ప్రభుత్వం నవ భారత సాక్షరత కార్యక్రమాన్ని అమలు చేసేందుకు చర్యలు మొదలు పెట్టింది.

క్షేత్రస్థాయిలో సేవలు ఇలా...

ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు ఉపాధ్యాయుల సేవలు వినియోగించుకుంటారు. ప్రధానోపాధ్యాయుడిని లిటరసీ సూపర్‌వైజర్‌గా కార్యక్రమం పర్యవేక్షిస్తారు. బోధకుల ఎంపిక, సామగ్రి అందజేత, బోధన తీరు, తరగతుల నిర్వహణ తదితర విషయాలను నిత్యం అనుశీలన చేస్తూ ప్రభుత్వానికి నివేదిక లు సమర్పిస్తారు. మరో ఉపాధ్యాయుడిని లిటరసీ టీచర్‌గా ఉంటారు. తరగతుల నిర్వహణ సజావుగా సాగేందుకు సమాచారం సేకరిస్తూ సూపర్ వైజర్‌కు, బోధకులకు అనుసంధాన కర్తగా పని చేస్తారు. మరో యాక్టివ్ ఉపాధ్యాయుడిని లిటరసీ సర్వేయర్ వ్యవహరిస్తారు. ఎంపిక చేసిన పాఠశాల ఆవాస ప్రాంతంలో విద్యావంతులైన బోధకులు, స్వచ్ఛంద కార్యకర్తలను గుర్తించి వారికి శిక్షణ తరగతులు నిర్వ హించి మిషన్ అందించే విద్యావిషయక సామగ్రిని సరఫరా చేస్తారు. పొదుపు సంఘాల మహిళలు, పాఠశాల విద్యార్థులను గుర్తించి వారిని ఈ ఉద్యమంలో భాగస్వామ్యులుగా చేస్తారు.

ఉపాధ్యాయుల నియామకానికి కసరత్తులు...

నవ భారత సాక్షరత కార్యక్రమంలో ప్రధాన భాగమైన బోధన, పర్యవేక్షణ ప్రధాన పాఠశాలలకు సంబంధించి ముగ్గురేసి ఉపాధ్యాయుల వివరాలు పంపాలని విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయాలకు ఆదేశాలు అందాయి. వేసవి సెలవుల్లోనే పూర్తి కావాల్సిన ఈ ప్రక్రియ ఎన్నికల, ఉపాధ్యాయుల పదో న్నతులు, బదిలీలతో జాప్యం జరిగింది. ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు సహా ముగ్గురు ఉపాధ్యాయులు పని చేయాల్సి ఉంటుంది. బోధనకు అవసరమైన పుస్తకాలు సిద్ధమవుతున్నాయి. జిల్లాలోని 183 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్ఐఎల్‌పీ కార్యక్రమం నిర్వహణకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం చేయడానికి కసరత్తులు జరుగుతున్నాయి. జిల్లాలో సుమారు 26 వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అధికారులు ఉన్నారు.

ఉల్లాస్ యాప్...

నవ భారత సాక్షరత కార్యక్రమం కోసం ఉల్లాస్ పేరిట యాప్ రూపొందించారు. పదిహేనేళ్లు నిండి న ప్రతి వ్యక్తిని అక్షరాస్యుడిని చేసేందుకు ఉల్లాస్ యాప్ రూపొందించారు. వయోజనులు ఆసక్తి గల విద్యార్థులు, స్వచ్ఛంద బోధకులు చరవాణి ద్వారా యాప్ దిగుమతి చేసుకుని వివరాలు ఇందులో పొందుపరచాలి. నమోదు సమాచారం అందడంతో పాటు వెంటనే ఉల్లాస్ యాప్‌లో ఎంతమంది చేరారన్నది ప్రదర్శనగా (డిస్‌ప్లే) పెడతారు. ప్రత్యేక తరగతులు రేడియో, టీవీ, సెల్‌ఫోన్ ద్వారా పాఠాలు చెబుతారు. ప్రధానంగా గణితంలో చతుర్విధ ప్రక్రియలు, జీవన సాఫల్యత గురించి మనో వైజ్ఞానిక పాఠాలు నేర్పుతారు. ఇందుకోసం పాఠ్యపుస్తకం కూడా రూపొందిస్తున్నారు. ప్రతి పాఠం బోధించాక పరిశీలన పేరిట పరీక్ష నిర్వహిస్తారు. సాధించిన సామర్థ్యాలను మదింపు చేసి మార్కుల రూపంలో వయోజనులకు వివరిస్తారు. అత్యధిక మార్కులు సాధించిన వారికి ధీటుగా మార్కులు పొందాలని ఉత్తేజ పూర్వక కథనాలు చెబుతారు. మొదటగా ప్రతి పాఠశాల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఆవాస పరిధిలో అధిక జనాభా ఉన్న గ్రామాలను గుర్తించి అక్కడ బోధకులను, నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి వారికి శిక్షణ తరగతుల నిర్వహణ చేపడతారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు...



జగన్ మోహన్ రెడ్డి, జిల్లా విద్యాధికారి

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలో అవసరమైన చర్యలు తీసుకుంటాము. ఇందుకు అనుగునంగా ఇప్పటికే ప్రాథమిక కసరత్తులు నిర్వహించాము. ఉపాధ్యాయుల నియామ కానికి అవసరమైన కసరత్తులు జరుగుతున్నాయి. జిల్లాలో ఎన్ఐఎల్‌పీ కార్యక్రమం ప్రారంభించాల్సి ఉంది.

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



ప్రజావాణిలో కలెక్టర్‌కు గోడు వెళ్లబోసుకుంటున్న దరఖాస్తుదారులు

జగిత్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 91 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లోని తమ తమ లాగిన్‌లో గల ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. వ్యయ ప్రయాలకు ఓర్చుకొని పలువురు బాధితులు జిల్లాకేంద్రానికి వచ్చి ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పిస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరుత్సాహానికి గురికావడంతో పాటు పలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకొని సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. శాశ్వత పరిష్కార దిశగా జవాబు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్ రెడ్డి, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీఓలు మధు సుదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు

ఎస్పీ అశోక్ కుమార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాల టౌన్, జూలై 15 :ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ చేసే దిశగా పోలీస్ అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మురుగు కాలువను పరిశీలిస్తున్న చైర్ పర్సన్

జగిత్యాల టౌన్, జూలై 15 : వర్షాకాలం దృష్ట్యా ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 14వ వార్డులో చైర్ పర్సన్ పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న మురికి కాలువలను పరిశీలించి పేరుకపోయిన సిల్ట్‌ను తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రజలకుండ ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్ పద్మ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అశోక్ ఉన్నారు.

నిరుద్యోగులను అయోమయానికి గురి చేస్తున్నారు

- ప్రభుత్వం మారినా బీఆర్‌ఎస్ బుద్ధి మారలేదు
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, జూలై 15: ప్రతిపక్ష పార్టీలు నిరుద్యోగుల్లో ఆత్మస్థైర్యం నింపాల్సింది పోయి వారిని అయోమయానికి గురి చేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో సోమవారం జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారి నప్పటికి బీఆర్‌ఎస్ బుద్ధి మాత్రం ఇంకా మారడం లేదని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రతి సంవత్సరం రెండు సార్లు నిర్వహించాల్సిన టెట్ పరీక్షను నాలుగేళ్లకు ఒక సారి నిర్వహించి నిరక్ష్యం వహించిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించే పనిలో ఉంటే సంతోష పడాల్సింది పోయి ఆందోళనకు గురి చేసేలా మాట్లాడడం తగదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ఉద్యోగాల బర్తీ క్యాలెండర్ అమలు చేయడంతో పాటు ప్రైవేటు సెక్టార్‌లో సైతం నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పూర్తి చేసి గ్రూప్-2 పరీక్షలు సైతం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నోటిఫికేషన్‌కు అనుగుణంగా పరీక్షలు నిర్వాహించాల్సి ఉంటుందని మార్పులు చేస్తే న్యాయస్థానం జోక్యం చేసుకుంటుందన్నారు. జూలై 18 నుంచి డీఎస్సీ పరీక్ష ప్రారంభ మవుతుందని ఇప్పటికే రెండు లక్షలకు పైగా అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకు న్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మాత్రం డీఎస్సీ పరీక్షలను రద్దు చేయాలని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ధిష్టమైన కార్యాచరణ రూపొందించుకుని పరీక్షలు నిర్వహిస్తుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక ఆటంకాలు కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ విద్యాసంవత్సరంలోనే మరో డీఎస్సీ భర్తీ ప్రక్రియ చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియగా కొనసాగుందన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, టీపీసీసీ సభ్యుడు మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి. పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్య, రూరల్ మండల అధ్య క్షుడు జున్ను రాజేందర్, నాయకులు పిప్పరి అనిత, రమేష్ బాబు, గంగారాం ఉన్నారు.

ఆకట్టుకున్న జ్యోతి స్వాగతోత్సవ్-2కే24



నృత్యాలు చేస్తున్న జ్యోతి స్కూల్ విద్యార్థులు

జగిత్యాల అర్బన్, జూలై 15: పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీ పాఠశాల నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమాన్ని జ్యోతి స్వాగతోత్సవ్-2కే24 పేరుతో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రదర్శించబడిన పలు నృత్య, నాటిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ప్రధానంగా మొబైల్ వాడకంపై విద్యార్థులచే ప్రదర్శించిన నాటిక విద్యార్థులను, పోషకులను విశేషంగా ఆకట్టుకొని, ఆలోచింపజేసింది. మొబైల్ వల్ల కలిగే అనర్థాలను ఈ నాటిక రూపంలో చక్కగా వివరించారు. నూతనంగా పాఠశాలలో అడ్మిషన్ అయిన విద్యార్థులకు యాజమాన్యం తరుపున విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసినట్లు పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, మౌనికరావు, అజిత, రజితతో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు



రాయికల్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

రాయికల్, జూలై 15: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలోని 1వ వార్డులో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో మొక్కలు నాటడంతో పాటు ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి వ్యక్తి మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గండ్ర రమాదేవి, మున్సిపల్ కమిషనర్ బి.చిరంజీవి, కౌన్సిలర్లు మారంపల్లి సాయి కుమార్, తురగ శ్రీధర్‌రెడ్డి, అనుమల్ల దివ్యఅనిల్, మ్యాకల అనురాధ, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మేనేజర్ బి.వెంకటి, మెప్మా ఆర్‌పీలు, వార్డు ప్రజలు, సిబ్బంది పాల్గొ న్నారు. అలాగే మండలంలోని అల్లీపూర్ గ్రామ పంచాయతీలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ఎండీ ఖయ్యూం, ఎంపీడీవో చిరంజీవిలు పాల్గొని స్థానిక గురుకుల బీసీ హాస్టల్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఎంఏ మొఖీద్, పాఠశాల హెచ్‌ఎం ఏపీవో దివ్య, టీఏ విజయ్, పీఎస్ఎస్ శేఖర్, ఆశా వర్కర్లు, ఐకేపీ సీసీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

జగిత్యాల టౌన్, జూలై 15 :విద్యారంగ సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మి నారాయణ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో గత 10 రోజులుగా జరుగుతున్న నిరుద్యోగుల ధర్నాకు మద్దతుగా జగిత్యాల జిల్లా నుంచి తరలివెళుతున్న బీసీ సంఘం నాయకులను ముందస్తుగా టౌన్ సీఐ వేణు గోపాల్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బీసీ నాయకులను అక్రమంగా అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించని పక్షంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ముందస్తు అరెస్టు అయిన వారిలో యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, జిల్లా ఉపాధ్యక్షుడు గుంటి గంగారాం, పట్టణ అధ్యక్షుడు రాపర్తి రవి తదితరులు ఉన్నారు.

డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీల ధర్నా

- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ సిబ్బందికి వినతి
- జీవో.నెం. 10ని రద్దు చేయాలని డిమాండ్



జగిత్యాలలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

జగిత్యాల అర్బన్, జూలై 15: అంగన్‌వాడీల పాలిట శాపంగా మారిన జీవో నెంబర్ 10ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ సంఘమైన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ క్యాంప్ ఆఫీస్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెం 10 ని రద్దుచేయడంతో పాటు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్‌లకు రూ.2 లక్షలు, హెల్పర్‌లకు రూ.లక్ష అందించాలని డిమాండ్ చేశారు. హెల్పర్‌లకు పాత పద్ధతిలో ఎస్సెస్సీ ప్రాతిపదకన ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ రూ. 26వేల కనీస వేతనం ఇవ్వాలని, 24 రోజుల సమ్మెకాల వేతనాలు వెంటనే చెల్లించాలని, రెండవ పీఆర్సీ ప్ర కారం 5శాతం ఐఆర్‌ను వర్తింపజేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని, ఈ పీఆర్సీ అమలుకు ముందు పేస్కేల్ కనీస వేతనం నిర్ణయించాలన్నారు. ఐసీడీఎస్‌లో ఆన్‌లైన్ యాప్‌లను రదుంద చేసి, ఒకే యాప్ ఉండేలా చూడాలని, బీఎల్‌వో డ్యూటీల రద్దు, ఖాళీ పోస్టుల భర్తీపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, కారుణ్య నియామకాలు అమలు చేయడంతో పాటు, జీవో నెం 14, 8లను తక్షణమే సవరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్య మాలకు కార్యచరణను సిద్ధం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రజిత, నాయకులు వెంకటచారి, రజిత, శారద, స్వప్న, సునీత, మల్లమ్మ, ఎల్లవ్వతో పాటు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఎదుట..



ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ధర్మపురి : అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదటు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అన్ని మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్మపురి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీచర్లు, హెల్పర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వ హ యాంలో పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇ చ్చిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవటం లేదని ఆరోపించారు. తమ డిమాండ్ల సాధన కోసం తాము చేపట్టిన ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది చేరుకుని ఆందోళన విరమించాలని నచ్చ జెప్పారు. విషయం తెలుసుకున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వారితో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించే దిశలో ముందుకు వెళతానని, వినతి పత్రాన్ని అందుబాటులో ఉన్న కాంగ్రెస్ నాయకులకు అందించాలని సూచించారు. అనంతరం వినతి పత్రాన్ని టీపీసీసీ సభ్యుడు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా సభ్యురాలు జయప్రద, సీఐటీయు జిల్లా అధ్యక్షులు రఫిక్, ఐసీడీఎస్ ప్రాజెక్టు ధర్మపురి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

కరీంనగర్ టౌన్, జూలై 15: డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టేందుకు అధికారులకు యువతకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో డ్రగ్స్ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయి అధికారులతో నార్కో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు కళాశాలల్లో డ్రగ్స్ నియంత్రణ కోసం అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు చేపట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేందకు కాన్సియస్‌నెస్ క్లబ్బులు ఏర్పాటుచేస్తున్నామన్నారు. పోలీసులు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు, పెట్రోలింగ్ నిర్వహించాల న్నారు. యువత లక్ష్య సాధన కోసం కఠోర శ్రమ చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ పవన్‌కుమార్, కరీంనగర్; హుజూరాబాద్ ఆర్డీవోలు కె మహేశ్వర్, రమేష్‌బాబు, అడిషనల్ డిసిపి లక్ష్మినారాయణ, ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి సుజాత, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం : ఎస్ఈ

గణేశ్‌నగర్, జూలై 15: విద్యుత్ ప్రజావాణిలో వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఎస్ఈ గంగాధర్ తెలిపారు. సోమవారం విద్యుత్ సర్కిల్ కార్యా లయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రజావాణిలో 15 ఫిర్యాదులు వచ్చాయన్నారు. విద్యుత్ వినియోగదారులు ఎలాంటి సమస్యలు ఉన్నా సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాల ని సూచించారు. సర్కిల్ కార్యాలయానికి 8 దరఖాస్తులు రాగా అందులో మూడు దరఖాస్తులు తక్షణమే పరిష్కరించినట్లు తెలిపారు. మూడు టౌన్ డివిజన్‌కు, నాలుగు రూరల్ డివిజన్‌కు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ, స్వప్న, ఏఈ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మందు బాబుల వీరంగం

● ఫర్నిచర్ ధ్వంసం

కోరుట్ల రూరల్, జూలై 15: మండలంలోని దర్మారం గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలలో మందు బాబులు వీరంగం సృష్టిం చారు. ఫర్నిచర్ ధ్వంసం చేసిన సంఘటనపై గ్రామస్థులు మల్లాపూర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయడంతో పరిశీలన జరిపి కేసు నమోదు చేశారు. పోలీసులు... గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మద్యం బాటిళ్లతో వెళ్లి పాఠశాల చివరి తరగతి గదిలో మద్యం సేవించి దానిలో ఉన్న ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. తెచ్చుకు న్న మందు బాటిళ్లను పగులగొట్టి చిందరవందరగా పడేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు క్లాస్ రూంలో చిందర వందరగా పడిఉన్న ఫర్నిచర్‌ను చూసి గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలం చేరుకున్న పోలీసులు పరిశీలన జరిపి విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వెల్గటూర్, జూలై 15: మండలంలోని కిషన్‌రావుపేటకు చెందిన కొత్తపల్లి నవీన్ (24) అనే యువకుడు చికిత్స పొం దుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపి న వివరాల ప్రకారం.. మృతుడు నవీన్ తల్లికి మతిస్థిమితం సరి గా లేకపోవడంతో రెండు నెలలుగా ఇంటి వద్దనే ఖాళీగా ఉండ డంతో ఆర్థిక పరిస్థితి దిగజారి ఇల్లు గడవడం కష్టంగా మా రింది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లో ఓ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు కొత్తపల్లి మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై హత్యాయత్నం

మల్యాల, జూలై 15: మండలంలోని మ్యాడంపల్లిలో ఆదివా రం రాత్రి ఒకరిపై హత్యాయత్నం జరిగింది. గుర్రం మల్లయ్య అనే వ్యక్తిపై ఇదే గ్రామానికి చెందిన అంజి అనే వ్యక్తి కత్తితో దాడి చేయగా మల్లయ్యకు గాయాలు కావడంతో చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. హత్యాయత్నానికి ఇరు కుటుంబాల మధ్య నెలకొన్న గొడవలే కారణమని తెలుస్తోంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమం

గణేశ్‌నగర్, జూలై15: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ ఎఫ్ఐ) జాతీయ కో-కన్వీనర్ వంగూరి వెంకటేశ్వర్లు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్లు వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నంద గణేష్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా కుమార్ తిరుపతిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నంద గణేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూని వర్శిటీల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. యూని వర్శిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

కల్తీ మద్యం, ఆహారంతో అనారోగ్యం

సుభాష్‌నగర్, జూలై 15: కల్తి మద్యం, కల్తి ఫుడ్ వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోష్కి శంకర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొమ్మకల్ గ్రామంలో ఉన్న వైన్ షాపు నిర్వాహకులు పరిశుభ్రతను పాటించడంలేదని ఆరోపించారు. ఇది వర్షాకాలమని, డెంగ్యూ వంటి విష జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వైన్‌షాపు నిర్వాహకులు, పర్మిట్ రూం నిర్వహణ సరిగా లేదని, పూర్తి స్థాయిలో శుభ్రపరచక పోవడంతో అందులో మద్యం సేవించడానికి వెళ్లేవారు వ్యాధుల బారిన పడుతున్నారని ఆరోపించారు. వైన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరు నిలిచిఉంటుందన్నారు. ఆ దారి గుండా వెళ్లే గ్రామ స్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ అధికారులు వెంటనే ఆ వైన్‌షాపును సందర్శించి కల్తి మద్యం అమ్మకాన్ని అడ్డుకోవాలని కోరారు.

ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని వినతి

కోరుట్ల రూరల్, జూలై 15: మండలంలోని నాగులపేట గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలింపును అరికట్టాలని కోరుతూ సోమవారం గ్రామానికి చెందిన యువకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడారు. గ్రామానికి చెందిన యువకులు గ్రామ శివారులోని సైఫన్ ప్రాంతంతో పాటు కథలాపూర్ మండలం తక్కల్లపల్లి శివారులోని వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తూ గ్రామంలో ఎవరు అడిగినా వారిపై నైతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపిం చారు. గ్రామానికి చెందిన వంతడుపుల స్వామి అనే వ్యక్తి ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తూ అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ అత నిపై ఫిర్యాదు చేసిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. అక్రమ రవాణా జరుగుతున్న విష యంపై ఎన్నిమార్లు రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించినా జరిమానాలను విధించి వదిలి పెట్టడంతో వారి ఆగడాలు ఆగడం లేదన్నారు. అక్రమ రవాణా అరికట్టి అక్ర మార్కులపై చర్యలు తీసుకోవాలని యువకులు కోరుతున్నారు.

గోదావరిఖని నుంచి అరుణాచల క్షేత్రానికి సూపర్ లగ్జరీ బస్సు

భగత్‌నగర్, జూలై 15: కరీంనగర్ రీజియన్ పరిధిలోని గోదావరిఖని నుంచి తమిళనాడు రాష్ట్రం అరుణాచల క్షేత్రానికి ఈ నెల 21న గురు పౌర్ణమిని పురస్కరించుకుని సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 శుక్రవారం రాత్రి 7గంటలకు గోదావరిఖనిలో బస్సు బయలుదేరి అదే రోజు రాత్రి 8గంటలకు కరీంనగర్ చేరు కుంటుందన్నారు. కరీంనగర్ నుంచి అరుణాచల క్షేత్రానికి వెళ్లే దారిలో భక్తులు శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం, తమిళనాడులోని వేలూరు శ్రీ మహాలక్ష్మి గోల్డె న్ దేవాలయం దర్శనం చేసుకున్న అనంతరం బస్సు 20వ తేదీ శనివారం రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరు కుంటుందన్నారు. అరుణాచల గిరి ప్రదక్షిణ దర్శనం అనంతరం 21వ తేదీ సాయంత్రం 5 గంటలకు తిరుగు ప్రయా ణంలో అలంపూర్ గద్వాల్‌లోని జోగులాంబ దేవస్థానం దర్శనం చేసుకుని 22వ తేదీ సాయంత్రం గోదావరిఖని చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో గోదావరిఖని నుంచి అరుణాచలంకు పెద్దలకు రూ.4,850, పిల్లలకు రూ.4,050, కరీంనగర్ నుంచి అరుణాలంకు పెద్దలకు 4,500, పిల్లలకు 3,800 ఛార్జీలు ఉంటాయన్నారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌లో సర్వీసు నెంబర్ 69999ను ఎంపిక చేసుకోవాలని కోరారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 15: దేవాలయాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో దొంగలను అరెస్ట్ చూపిన అనంతరం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పలు జిల్లాలోని దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి సంపత్(30), వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారానికి చెందిన అల్లెపు పర్శరాం (21) అనే ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద 8 తులాల బంగారు అభరణాలు, 2తులాల వెండి అభరణాలు ఒక ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్స్, ఇనుపరాడ్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు. ఈ ఇద్దరు దొంగలపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 కేసులు, జగిత్యాల జిల్లాలో 2కేసులు, కరీంనగర్ జిల్లాలో 2కేసులు , సిద్దిపేట జిల్లాలో ఒక కేసు నమోదైందని ఆయన తెలిపారు. హుస్నాబాద్ మండలంలోని అకుసాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి సంపత్ వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్‌లో ఉంటూ బావుల పూడిక మట్టిపని చేసుకొని జీవిస్తున్న క్రమంలో ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఆశతో దొంగతనాల వైపు దృష్టి పెట్టాడన్నారు. ఇతను ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామంలో గల పెద్దమ్మగుడి తలుపులు పగుల గొట్టి అమ్మవారి బంగారు పుస్తెలు, వెండి మట్టెలు చోరీకి పాల్పడినట్లు , మరుసటి రోజునే ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామ శివారులోని గొర్ల షెడ్డు నుంచి రెండు గొర్లను ఎత్తుకెళ్లాడన్నారు. ఆ తర్వాత వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారంకు చెందిన పరుశరాంతో స్నేహం ఏర్పడి ఇద్దరు కలిసి దేవాలయాల్లో చోరీలకు పాల్పడాలడని నిర్ణయించుకున్నారన్నారు. చందుర్తి డ్యాం వద్ద గల దుర్గమ్మ ఆలయం, కొడిమ్యాల మండలంలోని తిప్పాయపల్లిలో గల పెద్దమ్మ ఆలయం, బోయిన్‌పల్లి మండలంలోని జగ్గారావుపల్లిలో గల పెద్దమ్మ ఆలయం, వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల గ్రామంలోని పెద్దమ్మ ఆలయం, టెక్స్‌టైల్ పార్క్‌లోని పెద్దమ్మ ఆలయం, ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం, బోయిన్‌పల్లి మండలంలోని మల్లాపూర్ వద్ద గల సీతారామ ఆంజనేయ స్వామి ఆలయం, వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లిలో గల పెద్దమ్మ ఆలయం, ఒడ్యారం గుట్టపై గల రామాలయం, అల్లునూర్‌లోని ఎల్లమ్మ అలయం, వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల గ్రామంలోని ఎల్లమ్మఆలయం, కొడిమ్యాల మండలంలోని నల్లగొండ లక్ష్మినర్సింహాస్వామి ఆలయాల్లో ఇద్దరు దొంగలు బంగారు, వెండి ఆభరణాలు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఇల్లంతకుంట ఎస్ఐ శ్రీకాంత్ బృందంతో ప్రత్యేక బృందంను ఏర్పాటుచేసి ధర్యాప్తు చేపట్టగా ఇద్దరు దొంగలను ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరు వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.


దొంగల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో దొంగల సంచారం?

● సీసీ కెమెరా ఫుటేజ్‌లో ఇద్దరు వ్యక్తుల కదలిక

జ్యోతినగర్, జూలై 15: ఎన్టీపీసీ ఉద్యోగులు నివాసం ఉండే పర్మినెంటు టౌన్‌షిప్(పీటీఎస్)లో ఆదివారం రాత్రి దొంగల సంచారం కలకలం రేపింది. పీటీఎస్‌లోని చాచా నెహ్రూ పార్కు సమీపంలో ఉన్న సి - బ్లాకు క్వార్టర్ల ఏరియాలో ఇద్దరు ముసుగు వేసుకున్న అగంతకుల కదలికలను గుర్తించారు. అర్ధరాత్రి 3 గంటల సమయంలో ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు సంచరించినట్లు ఒక అధికారికి చెందిన ఇంటి సీసీ కెమెరాలో రికార్డయింది. అయితే ఆ ఇద్దరు దొంగలు ఎవరి ఇంట్లోనూ చోరీకి పాల్పడలేదు. సీసీ కెమెరా ఫుటేజీని ఎన్టీపీసీకి సంబంధించిన ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందికి అందించారు. ఫుటేజీని పరిశీలించిన సెక్యూరిటీ సిబ్బంది ఎన్టీపీసీ యాజమాన్యానికి సమాచారం అందించారు. సోమవారం ఎన్టీపీసీ ఎస్టేట్ అధికారులు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎన్టీపీసీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముసుగు వేసుకొని, చేతిలో చోరీకి ఉపయోగించే పరికరాలతో తిరుగుతున్న దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. వారి కదలికల ఆధారంగా అగంతకులు స్థానికులా? లేక ఇతర రాష్ట్రాలకు చెందిన వారా? అని విచారిస్తున్నట్లు సమాచారం. ఏడాది క్రితం ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్‌లోనే ఐదు ఇళ్లలో చోరీ జరిగింది. ఇప్పటి వరకు ఆ చోరీకి సంబంధించి ఎలాంటి పురోగతి కనిపించలేదు. మరోసారి దొంగల సంచారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నది.



ఎన్టీపీసీ పీటీఎస్‌లో సంచరిస్తున్న ఇద్దరు దొంగలు

హత్యాయత్నం కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూలై 15: కుటుంబ కలహాలతో భార్యపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో భర్త ఇస్లావత్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ సోమవారం తెలిపారు. మండలంలోని దేవునిగుట్ట తండాకు చెందిన విజయకు పదేళ్ల క్రితం కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామానికి చెందిన ఇస్లావత్ రమేష్‌తో వివాహమైంది. అదనపు కట్నం కోసం రమేష్ విజయను వేధింపులకు గురిచేయడంతో ఆరేళ్ల క్రితం కేసు నమోదైంది. ఇకనుంచి భార్యను బాగా చూసుకుంటానని పెద్దల సమక్షంలో అంగీకరించి విజయను ఇంటికి తీసుకెళ్లాడు. అతనిలో మార్పు రాకపోవడంతో వా రం రోజుల క్రితం విజయ గొల్లపల్లిలో గది అద్దెకు తీసు కుని పిల్లలతో కలిసి నివసిస్తోంది. ఈ నెల 14 రాత్రి విజ య నివసిస్తున్న ఇంటి వద్దకు చేరుకున్న రమేష్ ఆమెతో గొడవ పడ్డాడు. ఇంటిలో ఉన్న కత్తి తీసుకుని తలపై దాడి చేయడంతో విజయకు తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

24లోగా పీజీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, జూలై 15: ఎస్‌యూ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంబీఏ, ఎంసీఏ రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి 24వ తేదీ వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 27వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను ఆగస్టులో నిర్వహించనున్నారు.

వర్షం కోసం శివుడికి జలాభిషేకం


గోదావరి నది నుంచి బిందెలతో జలం తీసుకవస్తున్న ఆర్యవైశ్యులు

ధర్మపురి, జూలై 15: వర్షాలు విస్తారంగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ధర్మపురి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివుడికి జలాభిషేకం నిర్వహించారు. స్థానిక ఆర్య వైశ్యులు స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుంచి మేళ తాళాలతో గోదారవరి వరకు వెళ్లారు. అనంతరం గోదావరి మాతకు ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన ఆర్య వైశ్యులు బిందెలతో జలాలను తీసుకొచ్చి శివుడిపై పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ శాఖ అధ్యక్షులు మురికి శ్రీనివాస్, పట్టణ వర్తక సంఘం అధ్యక్షుడు అక్కెనపెల్లి రాజేందర్, జిల్లా నాయకులు జక్కు రవీందర్, ఆర్యవైశ్య, నిత్యాన్న సత్ర సంఘాల కోశాధికారులు రంగ శంకరయ్య, జక్కు దేవేందర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు జక్కు పద్మ, పట్టణ అధ్యక్షురాలు గందె పద్మ పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలని

వాటర్‌ట్యాంక్ ఎక్కి రైతు నిరసన


పురుగుల మందు డబ్బాతో ట్యాంకుపై రైతు


రైతు రాజేందర్

కాల్వశ్రీరాంపూర్, జూలై 15: పొలాలకు వెళ్లేందుకు రైతులకు దారి ఇవ్వాలని ఓ రైతు పురుగుల మందు డబ్బాతో వాటర్‌ట్యాంక్ ఎక్కిన సంఘటన మండలంలోని గంగారంలో జరిగింది. సంఘటన స్థలానికి పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఆ గ్రామానికి చెందిన రైతులు, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డితో పాటు గ్రామస్థులు వాటర్ ట్యాంకు వద్దకు వచ్చారు. సుమారు మూడు గంటల వరకు పురుగుల మందు డబ్బాతో రాజేందర్ వాటర్ ట్యాంక్ పైనే ఉండడంతో గ్రామస్థులు, రాజేందర్ కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు రాజేందర్‌తో ఫోన్‌లో మాట్లాడి దారి కోసం హామీ ఇవ్వడంతో పాటు తహసీల్దార్ జాహెద్ పాషా సంబంధిత ఇరిగేషన్ అధికారులను కాల్వపై భూమి కబ్జా అయిన స్థలం వద్దకు తీసుకు వస్తానని మాట ఇవ్వడంతో అంబాల రాజేందర్ వాటర్ ట్యాంక్ దిగాడు. దీంతో రాజేందర్ కుటుంబ సభ్యులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా రైతు అంబాల రాజేందర్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలనుంచి గ్రామానికి చెందిన యాట ఓదెలు తన వ్యవసాయ భూమి పక్కనున్న దారి నాదేనంటూ దున్ని, రైతులను ఆ బాట నుంచి వెళ్లకుండా చేశాడని పేర్కొన్నారు. దీంతో మూడు సంవత్సరాలుగా సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందన కరువైందన్నారు. ఎమ్మెల్యే, తహసీల్దార్ హామీతో వాటర్ ట్యాంక్ దిగినట్టు రాజేందర్ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి శిక్ష

కోల్‌సిటీ, జూలై 15: మద్యం తాగి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడిన కొత్తకొండ శంకర్ అనే వ్యక్తికి గోదావరిఖని రెండో అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి గురువ వెంకటేష్ సోమవారం మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిన 27మందికి రూ.58వేల జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

యువతి అనుమానాస్పద మృతి

గంగాధర, జూలై15: గంగాధర మండలం గర్షకుర్తిలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇన్ చార్జి ఎస్ఐ సురేందర్ వివరాల ప్రకారం.. గర్షకుర్తి గ్రామానికి చెందిన చింతం మాధురి(23) సోమవారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందింది. మాధురి తల్లి తన పెద్ద కూతురు ఇంటికి వెళ్లగా ఇంట్లో ఒక్కతే ఉంది. సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే పీజీ చదువుతున్న మాధవి చనిపోయేంత పిరికిది కాదని, ఆమె మృతిపై అనుమానం ఉందని మృతురాలి మేనమామ సిరిమల్ల రాజేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 15: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని సత్తేపీరీల దర్గా మూలమలుపు వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని గుండారం గ్రామానికి చెందిన వ్యక్తి జజ్జరి దేవరాజుకు తీవ్ర గాయాలపాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దేవరాజు తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి నుంచి గుండారంకు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారు అతి వేగంగా ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

వేములవాడ టౌన్, జూలై 15 : తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కోనాయపల్లి గ్రామానికి చెందిన బావుపేట రామస్వామి అనే గీత కార్మికుడు తన వృత్తిలో భాగంగా సోమవారం తాటి చెట్టుపై నుంచి కల్లు తీసేందుకు చెట్టుపైకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారీపడటంతో కాలు విరిగి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు ... తప్పిన ప్రమాదం

వేములవాడ టౌన్, జూలై 15 : ఆర్టీసీ బస్సును కారు వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటన వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి వేములవాడకు వస్తుండగా, కరీంనగర్ నుంచి ఎల్లారెడ్డిపేటకు కారు వెళుతుంది. ఈ క్రమంలో ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సు సడెన్‌గా నిలిపివేయడంతో వెనుకనుంచి స్పీడ్‌గా వస్తున్న కారు బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఎవరికి గాయాలు కాలేదు. ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు ముందటి బాగం పూర్తిగా ధ్వంసం కాగా కారులో వున్న డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 15 : కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ ప్లాట్‌ఫాం(16) వద్ద స్పృహకోల్పోయిన గుర్తుతెలియని వృద్ధురాలు(కమల) ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందిందని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 6:30 గంటల సమయంలో బస్టాండ్‌లో స్పృహ కోల్పోయిన వృద్ధురాలును 108 సిబ్బంది కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా తన పేరు కమలగా పేర్కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిగా డాక్టర్ పరీక్షించి మరణించినట్లు వెల్లడించారన్నారు. వృద్ధురాలు బస్టాండ్ పరిసరాలలో భిక్షాటన చేసి రాత్రి సమయంలో బస్టాండ్‌లో నిదిస్తుందని స్థానికుల ద్వారా వెల్లడైందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోలని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. మృతురాలిని గుర్తించినవారు కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ 8712670761, 9908440822కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి

ఎల్లారెడ్డిపేట, జూలై 15: మహారాష్ట్రలోని కొల్లాపూర్ జిల్లా పట్గావ్ గ్రామానికి చెందిన వలస కూలీ సంజయ్‌పూరీ (45) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని సిరిసిల్ల - కామా రెడ్డి రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు మహారాష్ట్రలోని కొల్లాపూర్ జిల్లా పట్గావ్ గ్రామనికి చెందిన వలసకూలీ సంజయ్‌పూరీ తన భార్య, సుమారు30 మంది సమీప బంధువులతో 12 రోజుల కిందట గొల్లపల్లి గ్రామానికి వలస వచ్చాడు. గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద ఓ గదిలో ఉంటూ వరి నాట్లు వేస్తున్నారు. సంజయ్ పూరీ రోడ్డు పక్క నుంచి వెళుతుండగా గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. అక్కడే ఉన్న తోటి కూలీలు అతన్ని మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని కరీంనగర్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. తోటి కూలీలు సంజయ్ పూరీకి వైద్యం అందించేందుకు స్వగ్రామానికి తరలిస్తుండగా మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

తంగళ్లపల్లి, జూలై 15: పొలం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళ్తున్న రైతును ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందాడు. బంధువుల కథనం ప్రకారం.. తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామానికి చెందిన బల్లెపు శంకరయ్య (58) సోమవారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గండిలచ్చపేట స్టేజీ మూలమలుపు వద్ద నాగళ్లతో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్రవాహనానికి ఢీకొనడంతో శంకరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగానే మృతిచెందాడు. మృతునికి భార్య దేవవ్వ, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓదెల మల్లన్న క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

● కన్నుల పండువగా అగ్నిగుండం, పెద్దపట్నం

ఓదెల, జూలై 15: వేదపండితుల మంత్రోచ్చరణ, ఒగ్గు పూజారుల ఢమరుక నాదాలతో శైవక్షేత్రం పంచాక్షరి మంత్రంతో విలసిల్లింది. జిల్లాలో ప్రసిద్ధి గాంచిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆది, సోమవారాల్లో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. పెద్దపట్నం, అగ్ని గుండం మహోత్సవాలు , అధికారులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆలయంలో ఒగ్గుపూజారులు పెద్దపట్నం వేసి మల్లికార్జునస్వామి జీవిత చరిత్రను కథ రూపంలో వివరించారు. సోమవారం అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు ఆలయంలో వేదపండితులు అర్చకులు, నిత్యోత్సవం , గణపతి పూజ, శివ పుణ్యాహవాచనం, శివ యాగ మండప స్థాపన , భద్రకాళి అవహనం , దక్షయాగం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ ధర్మకర్తలు, ఈవో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేషం , సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి , కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐ ఓంకార్ యాదవ్ , మంథని ఎస్ఐ వెంకట కృష్ణ , ధర్మకర్తలు కనికిరెడ్డి సతీష్, చింతం వెంకటస్వామి, కర్రె కుమార్, చింతం మొగిలి, బత్తుల రమేష్, మ్యాడగోని శ్రీకాంత్, దాసరి రాజన్న, ఆరెల్లి మొండయ్య, మూడెత్తుల శ్రీనివాస్ ఉన్నారు.


బ్రహ్మోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే విజయరమణరావు

ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్‌పై డీఈ విచారణ

● తరచూ కాలిపోతుండటంపై ఆరా
● 'ఆంధ్రజ్యోతి' కథనానికి విద్యుత్ అధికారుల స్పందన

గంగాధర, జూలై 15: ట్రాన్స్‌ఫార్మర్లు తరచుగా ఎందుకు కాలిపోతున్నాయని కరీంగస్ విద్యుత్ శాఖ టెక్నికల్ డీఈ విజేందర్‌రెడ్డి మండల విద్యుత్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన గంగాధర మండలం వెంకంపల్లిలోని ఎస్ఎస్226, బూరగుపల్లి ఎస్ఎస్6, ర్యాలపల్లిలో ఎస్ఎస్1, నాగిరెడ్డిపూర్‌లోని ఎస్ఎస్99 ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు గ్రామాల్లో ఎన్ని ఫెయిల్ అయ్యాయి, తరచుగా ఎందుకు జరుగుతోందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పుడు మారుస్తున్నారనే వివరాలు సేకరించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈడీఏ సత్యనారాయణరెడ్డి, ఏఈ తిరుపతి, సవాయ్‌నాయక్, సబ్ ఇంజనీర్ మోహన్, లైన్‌మెన్లు ఉన్నారు.


వెంకంపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న డీఈ


కొలిమికుంట వద్ద రహదారిపై గుంతలు


చొప్పదండి వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి

గుంతలున్నాయ్.. జాగ్రత్త

● ప్రమాదకరంగా రాయపట్నం రహదారి ● ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
● మరమ్మతులు చేపట్టని అధికారులు

చొప్పదండి,జూలై15:ఆరు జిల్లాలకు వారధిగా నిలుస్తున్న రాయపట్నం రహదారిని పట్టించుకునే వారు కరువయ్యారు.ప్రతినిత్యం వందలాది వహనాలు,వేలాది మంది ప్రజలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు.చొప్పదండి మండల పరిదిలో రహదారి 15కిలోమీటర్ల దూరం ఉండగా పలు చోట్ల గుంతలు పడగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.రెండేళ్ళ క్రితం రహదారికి మరమత్తులు చేపట్టగా చిన్న వర్షానికే పలు చోట్ల గుంతలు పడ్డాయి.చొప్పదండి లోని గుమ్లాపూర్ క్రాస్ రోడ్డు వద్ద మరమత్తులు చేపట్టకపోవడంతో దాదాపు అర కిలోమీటర్ మేరకు రహదారి ధ్వంసం అయ్యింది.ఇక్కడ తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.రుక్మాపూర్,కొలిమికుంట శివార్లలో పలు చొట్ల గుంతలు పడగా ఇప్పటికైనా అదికారులు స్పందించి రహధారికి మరమత్తులు చేపట్టాలని ప్రజలు కొరుతున్నారు.


రుక్మాపూర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

ఎస్సారెస్పీలోకి పెరుగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 3,831 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. సోమవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,831 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 13.078 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 19.850 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 494 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 7.381 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

యువతిని వేధించిన వ్యక్తిపై కేసు

ఇల్లందకుంట, జూలై 15: టేకుమట్ల మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల రవీందర్‌పై ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్లో సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇల్లందకుంట మండలంలోని గడ్డివానిపల్లె గ్రామానికి చెందిన ఓ యువతిని సెల్‌ఫోన్‌లో వేధించగా, యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.

వృద్ధుడి మృతి

శంకరపట్నం, జూలై 15: మండలంలోని కన్నాపూర్‌లో కారు ఢీకొని చికిత్స పొందుతూ మతిస్థిమితం లేని వృద్ధుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నక్క గట్టయ్య (72) అనే మతిస్థిమితం సరిగాలేని వృద్ధుడిని ఇటీవల కన్నాపూర్ గ్రామంలో కారు ఢీకొట్టింది. చికిత్స చేయించి ఆస్పత్రి నుంచి రెండురోజుల క్రితం ఇంటికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించి సోమవారం ఇంటి వద్ద మృతి చెందాడు.

నైపుణ్య శిక్షణతోనే యువతకు ఉజ్వల భవిత

●కాకతీయ సాండ్ బాక్స్ రీజనల్ మేనేజర్ శేఖర్ గోనె
●నలంద డిగ్రీ కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డే వేడుకలు

జగిత్యాల అర్బన్, జూలై 15: నైపుణ్య శిక్షణతోనే యువతకు ఉజ్వల భవిత ఉంటుందని కాకతీయ సాండ్ బాక్స్ రీజనల్ మేనేజర్ శేఖర్ గోనె అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక నలంద డిగ్రీ కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డే వేడుకలు దేశ్‌పాండే ఫౌండేషన్, కాకతీయ సాండ్ బాక్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకతీయ సాండ్ బాక్స్ రీజనల్ మేనేజర్ శేఖర్ గోనె హాజరై మాట్లాడుతూ దేశంలో నైపుణ్యం గల యువత కొరత ఉందని, విద్యార్థులు కేవలం మార్కులు, డిగ్రీలు సాధించడంపైనే దృష్టిసారించడంతో కార్పొరేట్ ఉద్యోగాలు పొందడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారికోసమే దేశ్‌పాండే ఫౌండేషన్, కాకతీయ సాండ్ బాక్స్ వారు గ్రామీణ ప్రాంత డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులకు ఆరు నెలల పాటు నైపుణ్య శిక్షణ ఇచ్చి మల్టినేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు ఇప్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అకడమిక్ కో ఆర్డినేటర్ నరేందర్ రెడ్డితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో...

ప్రపంచ నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా దేశపాండే ఫౌండేషన్, కళాశాల యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో వేడులకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆర్‌కే విద్యాసంస్థల అధినేత యాద రామకృష్ణ మాట్లాడుతూ నైపుణ్యాలు కలిగి ఉన్న వ్యక్తులకే భవిష్యత్తులో అవకాశాలను అందిపుచ్చుకుంటారన్నారు. నైపుణ్యాభివృద్ధికి ప్రతి విద్యార్థి సాధన చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రతినిధులు శేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, వెంకట రమేష్, ప్లేస్మెంట్ ఆఫీసర్ మల్లేశం తదితరులున్నారు.



నలంద కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డే వేడుకలు

ఎస్సారెస్పీ భూములను కాపాడాలి

ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన రైతులు

మెట్‌పల్లి రూరల్, జూలై, 15 : మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామ పరిధిలోని ఎస్సారెస్పీ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని రైతులు అధికారులను కోరారు. సోమవారం మెట్‌పల్లి ఆర్డీవో, తహసీల్దార్, ఎస్సారెస్పీ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ పరిధిలో ఉన్న ఎస్సారెస్పీ కాలువ భూమిలో వరి కొనుగోలు చేయడానికి భూమిని చదును చేశామన్నారు. అందులో కొంత భూమిని గ్రామానికి చెందిన వేముల చిన్న మల్లయ్య ఆక్రమించాడన్నారు. ఎస్సారెస్పీ కాలువకు ఇరువైపులా హద్దులు ఏర్పాటు చేయాలని, ఆక్రమాలకు పాల్పడినట్లు తెలిని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. కాలువ వెంట ఆక్రమణలు ఉంటే ఆ భూమిని కాపాడాల ని అధికారులను కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చిన వారిలో గంగాధర్, అశోక్, రాజేందర్, రవి, రైతులు, తదితరులు ఉన్నారు.


ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న వెల్లుల్ల రైతులు

గోల్డ్ మెడల్ సాధించిన సారంగాపూర్ విద్యార్థి

సారంగాపూర్, జూలై, 15: మండల కేంద్రానికి చెందిన కుసుంబ శుభకర్ ఎంటెక్ సివిల్ ఇంజనీర్ విభాగంలో సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించాడు. హైదరాబాద్‌లోని బ్రహ్మకుమారి శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరిగిన యునివర్సిటీ స్నాతకోత్సవంలో సీఎస్ఐ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రీయల్ డైరెకర్ జనరల్ ఎన్ కలైసెల్వి ముఖ్య అతిథిగా పాల్గొనగా ఆమె చేతుల మీదుగా శుభకర్ గోల్డ్ మెడల్ పట్టాను అందుకున్నాడు. సాంకేతిక రంగంలో ఏదైన అద్భుతమైన ఆవిష్కరణ చేసి పీహెచ్‌డీ చేయాలన్నదే తన లక్ష్యమని శుభకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, ఎల్ రమణ, నాయకులు కొంద్ర రాంచందర్ రెడ్డి, గుర్రాల రాజేందర్‌రెడ్డి, గ్రామస్థులు అభినందించారు.

అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు

ప్రభుత్వం మారితే తప్ప ప్రజల సమస్యలు గుర్తొచ్చాయా

బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాయికల్, జూలై 15: గత బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడేళ్లు గడిచినా పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులకు అధికారం కోల్పోయాక ప్రజల సమస్యలు గుర్తుకు వస్తున్నాయా అని కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్ మ్యాకల అనురాధ ప్రశ్నించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో రాయికల్ కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందించామని గుర్తు చేశారు. 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించక అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తుందని, అధికారంలో ఉండగా ప్రశ్నించని కౌన్సిలర్లు బీఆర్ఎస్ ప్రభుత్వం కనుమరుగయ్యాక ఉనికి కాపాడుకోవడం కోసం ప్రజలపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని విమర్శించా రు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్య దర్శి కొయ్యడి మహిపాల్‌రెడ్డి, నాయకులు దివాకర్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ధర్మపురి హెచ్ఎస్సీ పూర్వ విద్యార్థులు

ధర్మపురి, జూలై 15: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1969 హెచ్ఎస్సీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదివిని ఆనాటి విద్యార్థులు తమ జ్ఞాప కాలను పంచుకున్నారు. ఓరియంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంగనభట్ల నర్సయ్య మాట్లాడుతూ 55 ఏళ్ల క్రితం చదువుకున్న ఆనాటి విద్యార్థులందరూ 70 ఏళ్ల పైబడి ఉన్న వారేనని తెలిపారు. మొదట తమను విడిపోయిన విద్యార్థులను, మృతి చెందిన అధ్యాపకులను స్మరించి, శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమానికి చైతన్య భారతి విద్యానికేతన్ సంస్థాపకులైన సంగనభట్ల రామకిష్టయ్య విశిష్ట అతిథిగా హాజరయ్యారు. పీవీ నర్సింహారావు, భగవగ్గీత వంటి గ్రంథాలను వితరణ చేశారు. తమ అధ్యాపకులైన ఇందారపు నర్సింగరావు ఇంటికి వెళ్లి వారిని సన్మానించారు.

తలరాతలు మార్చే శక్తి విద్యకే ఉంది

రాష్ట్ర ఆద్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి


ఆల్బమ్ ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

బీర్‌పూర్, జూలై 15: మనిషి తలరాతలను మార్చే శక్తి విద్యకే ఉందని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి అన్నారు. సోమవారం స్థానిక బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఆవరణలో జిల్లా ఆర్యవైశ్య ప్రతిభా పురస్కార్ 2024 కార్యక్రమ చిత్ర మాలిక (ఫొటో ఆల్బమ్) ఆవిష్కరించారు. అనంతరం లింబాద్రి మాట్లాడుతూ ఎస్సెస్సీ, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన దాదాపు 140 మందికి బంగారు పథకాలు అందజేయడం గొప్ప విషయమన్నారు. ఆర్య వైశ్యులలలో ప్రతిభా వంతులైన విద్యార్థులను ప్రోత్సహించే విధంగా కార్యక్రమం నిర్వహించిన శ్రీ వాసవి ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పబ్బ శ్రీనివాస్, మైలారపు రాంబాబులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నూనె శ్రీనివాస్, ముక్క వేణుగో పాల్, దువ్వ రాజు, మర్యాల రాజన్న, గంప శ్రీనివాస్, కోట కిరణ్, భూసం సతీష్, కటకం శంకర్ పాల్గొన్నారు.

చైర్మన్ అన్వేష్ రెడ్డిని సన్మానించిన జువ్వాడి

కోరుట్ల, జూలై 15 : రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్వేష్ రెడ్డిని సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. హైదరాబాదులోని విత్తనాభివృద్ధి శాఖ కార్యాలయంలో అన్వేష్ రెడ్డిని జువ్వాడి నర్సింగ రావు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లూర్ మహేందర్ రెడ్డి, షేర్ నర్సరెడ్డి, మహిపాల్ రెడ్డి, ఏలేటి శశీందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సంతోష్, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

గుంతల ప్రయాణం..నరకయాతన

●ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు ●ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



రుకపల్లి- హన్మాజీపేట గ్రామాల మధ్య దెబ్బతిన్న రహదారి..తిమ్మాపూర్ రహదారిపై ఏర్పడిన గుంతలో నిలిచిన నీరు

జగిత్యాలరూరల్, జూలై 15 : గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. రహదారులపై గుంతలు పడి తారు లేచిపోయినా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల అర్బన్‌మండలంలోని పెరుకపల్లి మీదుగా హన్మాజీపేట గ్రామానికి వెళ్లే రహదారి బ్రిడ్జి వద్ద గత సంవత్సరం క్రితం కురిసిన వర్షాల దాటికి రహదారి పూర్తిగా దెబ్బతినడంతో పలు చోట్ల గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. దీంతో ప్రయాణికులు దెబ్బతిన్న రహదారి వద్ద వాహనాలు ఆగి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. రాత్రి సమయంలో రహదారిపై నుంచి ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులు గుంతలో పడి తీవ్రగాయాలపాలయ్యారు. అలాగే జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ నుంచి పొలాస వరకు వెళ్లే రహదారి పూర్తిగా గుంతలు పడి దెబ్బతిన్నది. ఈ రహదారి వెంట ప్రయాణించే వాహనదారులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజుల క్రితం రహదారి వెంట బైక్ పై ప్రయాణిస్తూ రహదారిపై ఏర్పడ్డ గుంతలో పడి సంతోష్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొడిపెల్లి రాజు అనే గ్రామస్థుడు ప్రజావాణిలో మూడుసార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని ఆదిశగా చర్యలు చేపట్టడం లేదని ఆరోపించాడు. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్థి మీదుగా బావాజీపల్లె వైపు వెళ్లే రహదారి గుంతలు పడి ప్రయాణికులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, గ్రామస్థులు, విద్యార్థులు జిల్లా కేంద్రానికి రావడానికి నిత్యం నరకయాతన పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు స్పందించి దెబ్బతిన్న గ్రామీణరహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

ఇట్నేని సురేష్, హన్మాజీపేట



జగిత్యాల అర్బన్ మండలం పెరుకపల్లి మీదుగా హన్మాజీపేట వైపు వెళ్లే బ్రిడ్జి వద్ద గత సంవత్సరం కురిసిన వర్షాల ధాటికి రహదారి తారు లే చిపోయి పూర్తిగా దెబ్బతిన్నది. రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు గుంతల్లోపడి తీవ్రంగా గాయపడ్డారు. ప్రయాణికులు, గ్రామస్థులు నిత్యం నరకయాతన పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలి.

ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు

కొడిపల్లి రాజు, తిమ్మాపూర్



జగిత్యాల రూరల్ మండలం రఘురాముల కోట మీదుగా తిమ్మాపూర్, పొలాస వైపు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలు ఏర్పాడ్డాయి. ప్రయాణికులు, గ్రామస్థులు, విద్యార్థులు రహదారిపై ప్రయాణం చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై ఏర్పడ్డ గుంతల్లో పడి ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రజావాణిలో రహదారికి మరమ్మతులు చేపట్టాలని మూడుసార్లు వినతి పత్రం అందజేశాను. ఇప్పటి వరకు ఆదిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలి

జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు

జగిత్యాల అర్బన్, జూలై 15: జగిత్యాల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మ మాట-అంగన్వాడీ బడిబాట పేరుతో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని విద్యానగర్‌లో గల అంగన్వాడీకేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీవో వీరలక్ష్మీ పాల్గొని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు కొత్త సిలబస్ ప్రకారం ప్రీ స్కూల్ విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత రాణి, అంగన్వాడీ టీచర్లు అరుణ, రజిని, యతీశ్వరీ, జయమాల, అంజలి, కళావతి, మాధవి, నీలోణి, భాగ్యలక్ష్మీ, సీమ, లక్ష్మీ, శివప్రియ తదితరులున్నారు.

మెట్‌పల్లి : తల్లిదండ్రులు ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూపర్ వైజర్ శోభరాణి అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చేపట్టిన అమ్మమాట అంగన్‌వాడీ బడిబాట ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని పూర్వవీధుల్లో టీచర్లు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సూపర్ వైజర్ మాట్లాడుతూ ఐదేళ్లు దాడిన పిల్లలను గుర్తించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వారిని పూర్వ ప్రాథమిక విద్యా బోధన కోసం కేంద్రాల్లో చేరేలా ప్రోత్స కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాధస్మూ పద్మ, సుమలత, నజీమా, శ్రీదేవి, అనురాధ, సంగీత, అన్నపూర్ణ, గంగలక్ష్మి, సునీత, రాజమణి, పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని పెంబట్ల గ్రామంలో మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు సోమవారం పెంబట్ల అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్‌వాడా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా జిల్లా సవక్షేమ అధికారిణి వాణి శ్రీ పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రెండున్నర సంవత్సరాలు దాటిన పిల్లలను, బడి మాని వేసిన పిల్లలను గుర్తించి తిరిగి వారిని అంగన్‌వాడీ కేంద్రం లో చేర్పించారు. ఇదే గ్రామానికి చెందిన చుక్క మల్లయ్య అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా, టేబుల్‌ను విరాళంగా బహుకరించారు.

ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్‌లు లత, శైలజ, ఎమ్ఎల్‌హెచ్‌పీ సంపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు నర్సమ్మ, మీనా, అన్నపూర్ణ, రమణ, జ్యోతి, లక్ష్మీ, పుష్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సంక్షేమ అధికారి వాణిశ్రీ

మల్యాల: మండలంలోని పోతారంలో సోమవారం అమ్మ మాట.. అంగన్ వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు, తల్లులు, కిషోర బాలికలు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపించాలని నినాదాలు చేశారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ రాజశ్రీ, టీచర్లు శ్రీలత, జమున, వనజ హెచ్.ఎం. జయసింహారావు పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అమ్మమాట అంగన్‌వాడీ బడిబాట ప్రదర్శన, ర్యాలీల కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం గ్రామాల్లో అమ్మమాట అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లులు, చిన్నారులతో ర్యాలీలు, ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్ వాడి కేంద్రాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సైనీమథ్యూ, సమీమ్ సుల్తానా అన్నారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాలలో అంగన్ వాడి కేంద్రంలో నిర్వహిస్తున్న విద్యా బోధనలపై అవగాహన ర్యాలీలను అంగన్ వాడి టీచర్లు కిశోర బాలలకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాటి టీచర్లు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న వాహనాలు

ఒకరి పరిస్థితి విషమం

మెట్‌పల్లి రూరల్, జూలై, 15 : మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులోని జాతీయ రహదారి పై ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు, మరొక బాలుడుకి స్వల్ప గాయాలపాలైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మెట్‌పల్లికి చెందిన రాజయ్య నిజామాబాద్ జిల్లా నుంచి కారులో పట్టణానికి వస్తున్నారు. అదే సమయంలో మంచిర్యాల జిల్లా నుంచి నిజామాబాద్ జిల్లాకు వెళ్తున్న ఎర్టిగా కారు రాజేశ్వర్‌రావుపేట సమీపంలో వస్తున్న కారును ఢీకొంది. దీంతో రాజయ్యతో పాటు ఓ బాబు తీవ్ర గాయాలపాలవగా, మరి కొంత మందికి స్వల్ప గాయాలపాలైనట్లు తెలిపారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి

●ముత్యంపేటలో జ్వర సర్వే

మల్యాల, జూలై 15: ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకో వాలని ప్రోగ్రాం అధికారి జైపాల్‌రెడ్డి, మండల వైద్యాధికారి మౌనిక ప్రజలకు సూచించారు. మండలంలోని ముత్యంపేటలో సోమవారం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు.

నీటి నిలువలతో డెంగ్యూ తదితర జ్వరాలు సోకే అవకాశం ఉం టుందని, జ్వరాల భారిన పడితే మల్యాలలో ప్ర భుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయిం చుకొని తగిన మందులు వాడా లని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. చిన్న పిల్లలు ఉన్న ప్రదేశంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గ్రా మంలో వైద్య శిబిరం నిర్వహించారు. వానా కాలంలో వ్యాధుల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అహల్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు రక్షణగా ప్రత్యేక చట్టం తేవాలి

- మెట్‌పల్లి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి

మెట్‌పల్లి, జూలై, 15 : న్యాయవాదులకు రక్షణగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని మెట్‌పల్లి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి డిమాండ్ చేశారు. సోమవారం మెట్‌పల్లి కోర్టు ముందు న్యాయవా దులతో కలిసి నిరసన తెలిపినంతరం సిద్దిపేటకు చెందిన న్యాయవాది రవికుమార్‌పై పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐ అకారణంగా దాడి చేసి దుర్భాషలాడి తప్పుడు కేసు పెట్టడాన్ని ఖండించి విధులను బహిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం ఎక్కడో ఒక్క చోట న్యాయవాదులపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టడంతో పాటు దాడులకు పాల్పడుతుండం సరైన పద్ధతి కాదన్నారు. న్యాయవాదులకు రక్షణగా ప్రత్యేక చట్టం రూపొందించాలని ప్రధాన మంత్రి, హోం శాఖ, న్యాయశాఖ మంత్రులను కోరారు. న్యాయవాదులపై దాడులు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, న్యాయవాదులు వెంకటనర్సయ్య, లక్ష్మారెడ్డి, దయా కర్‌వర్మ, జేడీ సుధకర్, నరహరి, నర్సయ్య, శంకర్ పాల్గొన్నారు.



మెట్‌పల్లిలోని కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సంక్షిప్తం సమాచారం

కథలాపూర్: మండల పరిషత్ అధికారిగా పనిచేస్తున్న ప్రవీణ్ మల్యాలకు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా కలెక్టర్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రవీణ్ ఎంపీవో నాలుగున్నరేళ్లుగా విధులు నిర్వర్తించారు.

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు లయన్స్ క్లబ్ సభ్యుడైన వనపర్తి చంద్ర మోహన్- రమ్య దంపతులు భారీ టీవీని బహూకరించారు. చంద్రమోహన్-రమ్య దంపతుల కుమారుడు శ్రీ రాగ్ వనపర్తి పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలకు టీవీని బహూకరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీగద్దె నరేంద్ర పీ ఈటీ అనిల్, లింగారెడ్డి పాల్గొన్నారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని సోమవారం ప్రకటన ద్వారా ప్రిన్సిపాల్ తెలిపారు. మైనార్టీ, నాన్ మైనార్టీ కేటగిరీలలో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు మిగిలిన సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 18 సాయంత్రం 4 గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని, పూర్తి వివరాల కోసం మైనార్టీ బాలురుల గురుకుల పాఠశాలలోని ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని తెలిపారు.

గొల్లపల్లి: అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహ్మద్ జమీర్ పేర్కొన్నారు. సోమవారం గొల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీవో సురేష్‌రెడ్డి, ఏపీఎం త్రివేణి, మండల పశువైద్యా ధికారి డా. రవీంధర్, ఏఈవో గంగాధర్ నాయక్, పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని అగ్గిమల్ల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన తడవేణి వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఉదయం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం, 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరకులను సోమవారం పంపిణీ చేశారు.

ధర్మపురి: మండలంలోని మగ్గిడి మోడల్ స్కూల్‌లో చదివే కొసునూర్‌పల్లె విద్యార్థులకు సోమవారం నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. కొసునూర్‌పల్లె గ్రామానికి చెందిన విద్యార్థులు నిత్యం మగ్గిడి స్కూల్‌కు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో గ్రామస్థులు ఇటీవల ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటను ఆయన జగిత్యాల డిపో మేనేజర్‌తో మాట్లాడి కొసునూర్‌పల్లె గ్రామానికి బస్సు వేయించారు.

ధర్మపురి: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు సోమవారం పూజలు నిర్వహించారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వరుడిని దర్శనం చేసుకున్నారు.

రాయికల్: రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన రాజారపు శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష చెక్కును ఆదివారం ఎంపీ ధర్మపురి అర్వింద్ అందజేశారు.

పెగడపల్లి: వనమహోత్సవంలో ప్రతి పౌరుడు పాల్గొని మొక్కలు నాటి సంరక్షించాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్ గ్రామ శివారులో కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో భాగంగా సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు.

జగిత్యాల టౌన్ : ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఈద్గాలో సోమవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా చైర్ పర్సన్ అడువాల జ్యోతితో, విద్యార్థులతో కలిసి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మొక్కలు నాటారు.

భీమారం: గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం కోసం రానున్న బడ్జెట్ సమావేశాల్లో రూ.500 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని కోరుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు వేర్వేరుగా గల్ఫ్ జేఏసీ బృందం సభ్యులు వినతి పత్రం సమర్పించారు.